సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం | 17 | మే | 2025



తాగునీటికి కటకట..!

పార్వతీపురం మన్యం జిల్లాలో తాగునీటి ఎద్దడి నెలకొంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల గొంతెండుతోంది. - IIలో



రైతుల భూములు పోకుండా పైప్‌లైన్ వేయాలి

- IIలో

రైతుల భూములు పోకుండా పైప్‌లైన్ వేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు కోరారు.



మూడు పెంకుటిళ్లు దగ్ధం

గరుగుబిల్లి మండలం చినగుడబలో శుక్రవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో మూడు పెంకుటిళ్లు దగ్ధమయ్యాయి. - IIలో

న్యూస్‌రీల్

మళ్లీ వచ్చిన ఏనుగులు



ఆర్తాం పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగులు

కొమరాడ: నాగావళి నది ఆవల ఒడిశావైపు సంచరించిన ఏనుగులు గురువారం అర్ధరాత్రి నది దాటి దుగ్గి మీదుగా ఆర్తాం గ్రామ పరిసరాలకు చేరుకున్నాయి. గుణానపురం, దుగ్గి, కళ్లికోట తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. రాత్రి పూట ప్రయాణం చేసేవారు టీకర్స్ నుంచి ఏనుగుల సంచారం సమచారం తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వం స్పందించి ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

అక్టోబర్ నాటికి గృహనిర్మాణాలు పూర్తి చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: గృహనిర్మాణాలను అక్టోబర్ నాటికి పూర్తిచేయాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పలు గ్రామాల్లో పీఎం జన్‌మన్ పథకంలో మంజూరైన ఇళ్ల పనులను శుక్రవారం పరిశీలించారు. పెద్దగూడ, మండ, దీనరిగూడ గ్రామాలను సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. బిల్లులు వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు పూర్తయిన ఇళ్లకు బిల్లులు ఈ నెలాఖరుకు చెల్లించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీబీ మిశ్రో, హౌసింగ్ ఏఈ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ బదిలీలు చేపట్టాలి



సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఎంఈఓలకు బదిలీ ప్రక్రియ చేపట్టాలని ఎంఈఓ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం విద్యా శాఖ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు శుక్రవారం లేఖ రూపంలో విన్నవించామన్నారు. ఎంఈఓలుగా పని చేస్తున్న వారిలో చాలా మంది 2017 నుంచి ఒకే ప్రదేశంలో పనిచేస్తున్నా బదిలీలు నిర్వహించలేదన్నారు. టీచర్ల బదిలీ ప్రక్రియ పూర్తయిన తరువాత ఎంఈఓలు నూతన ప్రదేశాల్లో చేరేలా ఉత్తర్వులు ఇవ్వాలని లేఖలో కోరినట్టు తెలిపారు.

పైడితల్లికి స్వర్ణపుష్పార్చన

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి పైడితల్లికి శుక్రవారం స్వర్ణ పుష్పార్చన చేశారు. వేకువజాము నుంచి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు అచ్యుతశర్మ, శివప్రసాద్‌శాస్త్రోక్తంగా అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన సేవను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అభివృద్ధి చేతకాక
అభాండాలు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, కౌన్సిలర్లు

- శ్యామలాంబ జాతరకు నిధులు విదల్చని ప్రభుత్వం
- మంత్రి నిర్లక్ష్యంతో రూ.2కోట్ల అప్పుతో పండగ పనులు!
- పనుల పేరుతో అప్పడబ్బును, విరాళాలను దోచుకునే ప్రయత్నాలు
- మహిళపై దౌర్జనం చేసిన టీడీపీ నాయకుడిని మంత్రి మందలించకపోవడం శోచనీయం
- మంత్రి తీరుపై మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్ల అసహనం

సాలూరు:

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుచేయలేక, అభివృద్ధి పనులు చేతకాక కూటమి నేతలు అబద్ధాలు చెబుతూ ప్రతిపక్ష నేతలు, ప్రజాప్రతినిధులపై అభాండాలు వేస్తున్నారని సాలూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, కౌన్సిలర్లు ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సంధ్యారాణి ఎమ్మెల్యేగా గెలుపొందడంలో కీలక పాత్ర పోషించిన సాలూరు మున్సిపాలిటీలో 15 ఏళ్ల తరువాత జరుగుతున్న శ్యామలాంబ అమ్మవారి పండగ కోసం ప్రభుత్వం నుంచి నిధులు సాధించలేకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలో 40 మున్సిపాలిటీలకు అప్పు రూపేణా (రీయింబర్స్‌మెంట్) రూ.2కోట్లు చొప్పున మంజూరైందని, సాలూరు మున్సిపాలిటీకి మంజూరైన రూ.2కోట్లతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం చేయడం మంత్రికి తగదన్నారు. పండగ ఏర్పాట్లలో అలసత్వంపై భక్తుల నుంచి విమర్శలు వస్తుండడంతో ఆ నిధులను పండగ కోసం వినియోగిస్తున్నారన్నారు. పనుల పేరుతో నిధులు కైంకర్యం చేసేందుకు పలువురు కూటమి నాయకులు ప్రయత్నిస్తున్న విషయాన్ని పట్టణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ నెల 14న జరిగిన అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అజెండాలో పెట్టిన అన్ని అంశాలకు నిబంధనల ప్రకారం ఆమోదం తెలిపినట్టు తెలిపారు. ఈ విషయాన్ని మరచి పండగ పనులు అడ్డుకుంటున్నారంటూ మంత్రి సంధ్యారాణి కౌన్సిల్‌ను విమర్శించడం విచారకరమన్నారు. చైర్‌పర్సన్‌పై టీడీపీ మండలాధ్యక్షుడు నిమ్మాది చిట్టి దుర్భాషలాడుతూ దౌర్జనం చేసినా సాటి మహిళగా మంత్రి మందలించకపోవడం బాధాకరమన్నారు.

పనుల్లో జాప్యం ఎవరిది?

మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల్లో జాప్యం మంత్రి, కమిషనర్‌దేనని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఆరోపించారు. ఏ వార్డుకు ఎంత కేటాయించాలి, ఏ పనులు చేపట్టాలనే అంశంపై మంత్రి సూచించక, అధికారులు పనుల జాబితా తయారు చేసి అజెండాలో పెట్టక పోవడంతో ఆలస్యమైందన్నారు. ఆ నెపాన్ని మున్సిపల్ కౌన్సిల్‌పై నెట్టే యత్నం శోచనీయమన్నారు. రూ.18 లక్షల ఖర్చుతో చీపుర్లు, బ్లీచింగ్ పౌడర్, ఇతర సామగ్రి కొనుగోలుకు కాంట్రాక్టర్ వానపల్లి శంకరరావు, ఇతరుల పేరున అజెండాలలోనే ఆమోదించాలని ఆర్డర్ వేసినది ఎవరో అందరికీ తెలుసన్నారు. మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం టెండర్లు పిలవకుండా శంకరరావు, ఇతరులకు అప్పగించేందుకు మంత్రి ఆదేశాలను ఆమోదించలేదనే తమపై నిందలు మోపుతున్నారని వాపోయారు.

ఆ మాటలు గుర్తున్నాయా?

- మున్సిపాలిటీ మొదటి సమావేశంలోనే కలెక్టర్ నుంచి రూ.30 లక్షలు తెప్పించి 15 రోజుల్లో సాలూరు పట్టణ పబ్లిక్ టాయిలెట్స్‌ను మరమ్మతులు చేయించి మహిళల ఆత్మగౌరవం కాపాడతానని మంత్రి సంధ్యారాణి చెపారు. ఏడాది కావస్తున్నా పనులు మాత్రం జరగలేదని, మంత్రికి ఆ మాటలు గుర్తులేకపోవడం విచారకరమని కౌన్సిల్ సభ్యులు పేర్కొన్నారు.
- పండగ నేపథ్యంలో ఓపెన్ టాయిలెట్స్ కోసం, 80 మంది పారిశుద్ధ్య కార్మికుల ఏర్పాటు, రెండు ట్రాక్టర్లు, చెత్త నిర్వహణ పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. దీనిని మంత్రి తన ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటన్నారు.
- దండిగాం రోడ్డు వద్ద మంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన వాటర్ ట్యాంకు శిలా ఫలకంపై మంత్రి పేరు మినహా, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు పేర్లు రాయించక పోవడం కమిషనర్‌కు తగదన్నారు. ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎమ్మెల్సీగా సంధ్యారాణి ఉన్నప్పుడు, ప్రోటోకాల్ పాటించలేదని మక్కువ మండలానికి చెందిన దళిత ఎంపీడీఓను సస్పెండ్ చేయించారని గుర్తుచేశారు. ఇప్పుడు కమిషనర్‌కు ఇది వర్తించదా అని ప్రశ్నించారు.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా పనిచేసిన రాజన్నదొర పాడేరులో మోదుకొండమ్మ అమ్మవారి పండగకు, శంబర పండగకు లక్షలాది రూపాయలు ప్రభుత్వం నుంచి విడుదల చేయించారని, 15 ఏళ్ల తర్వాత జరిగే శ్యామలాంబ పండగకు మంత్రిగా కొనసాగుతున్న సంధ్యారాణి ఎందుకు గ్రాంటు తెచ్చుకోలేకపోయారని ప్రశ్నించారు.
- శ్యామలాంబ పండగ విజయవంతాన్ని చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, అధికారులకు పూర్తిస్థాయిలో సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. తల్లి చల్లని కరుణ పట్టణ ప్రజలందరిపైనా ఉండాలన్నారు. కూటమి నేతలు తమ తప్పులను వైఎస్సార్ సీపీ పాలకవర్గంపై నెట్టే కుటిల రాజకీయాలకు అమ్మవారే గట్టిగా బుద్ధిచెబుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరి రఘు, గొర్లె జగన్‌మోహన్‌రావు, సింగారపు ఈశ్వరరావు, సత్యవతి, హరి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

5న చలో విజయవాడ

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ



మాట్లాడుతున్న సూర్యనారాయణ, తదితరులు

పాలకొండ రూరల్: వచ్చేనెల 5వ తేదీన విజయవాడలో తలపెట్టిన తృతీయ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కౌన్సిల్ సభలను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ కోరారు. పాలకొండలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలు, రానున్న రోజుల్లో చేపట్టదలచిన కార్యాచరణపై లోతైన చర్చ చేపడతామని తెలిపారు. పీఆర్‌సీ, పెండింగ్ డీఏలు, ఐఆర్‌తోపాటు పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆయన వెంట సంఘ నాయకులు ఎస్.భరత్‌భూషణరాజు, బి.గణేష్‌బాబు, శంకరరావు, సింహాచలం తదితరులు ఉన్నారు.

తనిఖీలా.. విచారణా?



మున్సిపల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీ

- మున్సిపల్ కార్యాలయానికి ఆర్డీ..
- కమిషనర్‌పై ఫిర్యాదు చేసిన పాలకవర్గ సభ్యులు

సాక్షి, పార్వతీపురం మన్యం: వివాదాలతో కొద్దిరోజులుగా వార్తల్లో నిలుస్తున్న పార్వతీపురం పురపాలక సంఘం కార్యాలయాన్ని ఆ శాఖ ఆర్డీ రవీంద్ర శుక్రవారం సందర్శించారు. సిబ్బంది పనితీరు, వివిధ అంశాలపై సమీక్షించారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే ఆయన జిల్లాకు వచ్చినట్లు చెబుతున్నప్పటికీ.. ఇటీవల కమిషనర్ తీరు పట్ల వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ చేపట్టారని కార్యాలయ వర్గాల నుంచి వినిపిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ తర్వాత పార్వతీపురం పురపాలక సంఘంలో సాధారణ, బడ్జెట్ సమావేశాలు నిర్వహించలేదు. మార్చి 8వ తేదీతో కోడ్ ముగిసినా.. ఎన్నోమార్లు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు కోరినా కమిషనర్ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్ సీపీకి చెందిన సభ్యులు దీనిపై పత్రికా ముఖంగా ఆవేదన వ్యక్తం చేయడంతో పాటు.. అధికారులకూ ఫిర్యాదు చేశారు. సమావేశాలు నిర్వహించకపోవడం వల్ల అభివృద్ధి పనులకు ఆమోదం లభించడం లేదని.. కమిషనర్ కూడా తమ పట్ల ప్రోటోకాల్ పాటించడం లేదని తెలిపారు. ఇదే విషయమై శుక్రవారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీ రవీంద్రకు కమిషనర్ వెంకటేశ్వర్లు సమక్షంలోనే మరోసారి ఫిర్యాదు చేశారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే సమయంలో పట్టణంలో నెలకొన్న నీటి ఎద్దడి, ఆక్రమణలు, ఇతర సమస్యలను ఆర్డీ దృష్టికి తీసుకెళ్లిన పలు ప్రజాసంఘాల నాయకులు.. కమిషనర్ తీరుపైనా ఏకరవు పెట్టడం గమనార్హం. అధికార పార్టీ ఎమ్మెల్యేకు తొత్తులా ఆయన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

సాధారణ తనిఖీలే..

ఇదే విషయమై ఆర్డీ వద్ద ప్రస్తావించగా.. నెలవారీ సాధారణ తనిఖీల్లో భాగంగానే వచ్చానని, పలు అంశాలపై సమీక్షించానని వివరించారు. చైర్ పర్సన్, ఇతర సభ్యులు పలు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని, విచారణ చేపడతామని చెప్పారు.

సాగునీటి పనులకు ప్రాధాన్యం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గరుగుబిల్లి: జాతీయ ఉపాధిహామీ పథకం పనుల్లో సాగునీటి పనులకు ప్రాధాన్యమిస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గరుగుబిల్లి మండలం కొంకడివరంలో ఉపాధిహామీ పథకం నిధులతో చేపట్టే చెరువు ఫీడర్ నిర్మాణం పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఉపాధిహామీ వేతనదారులతో మాట్లాడారు. వేతనాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. జిల్లాలో చెరువులను అనుసంధానిస్తూ 120 పనులు మంజూరయ్యాయన్నారు. కొంకడివరంలో బోనివాని చెరువులోకి వచ్చే ఫీడర్ చానల్‌కు గతంలో గండి కొట్టినచోట రూ.8 లక్షల వ్యయంతో పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు అప్పలనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జలవనరుల శాఖ ఈఈ ఆర్.అప్పలనాయుడు, ఉదయభాస్కర్, ఎంపీడీఓ జి.పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.



బోనివాని చెరువు ఫీడర్ నిర్మాణం పనులకు భూమిపూజ చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పార్వతీపురంటౌన్: జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను టెలీకాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. బీట్‌దిహీట్ శీర్షికన ఈనెల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు మండల స్థాయిలో వివిధ కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండడం, చలి వేంద్రాలను ఏర్పాటుచేయడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు.



పాలకొండ పట్టణంలో కురుస్తున్న వర్షం

మన్యంలో గాలివాన

పాలకొండ రూరల్/భామిని: పాలకొండ, భామిని మండలాల్లో శుక్రవారం సాయం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయమంతా భానుడు భగ్గుమన్నాడు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేశాడు. సాయంత్రం ఉరుములతో కూడిన భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. మామిడి, జీడి, ములగ, బొప్పాయి, మొక్కజొన్న, కాయగూరల పంటలకు నష్టంవాటిల్లింది. భామిని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రాంగణంలో ఈదురుగాలుల ప్రభావానికి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



భామిని గురుకులంలో విరిగి పడిన విద్యుత్ స్తంభం, చెట్ల కొమ్మలు

ఉసురు తీసిన పిడుగు



పిడుగుపాటుకు గురై మరణించిన లక్ష్మీదేవి

పాలకొండ రూరల్: పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కాలనీ (జగన్నాథస్వామి ఆలయ సమీప) ప్రాంతంలో శుక్రవారం పిడుగు రూపంలో ఓ మహిళను మృత్యువు కాటేసింది. భర్త కళ్లముందే భార్యను విగత జీవిగా మార్చేసింది. వివరాల్లోకి వెళ్తే... గృహ నిర్మాణంలో భాగంగా కటుంబసభ్యులు సూర్యనారాయణ, కృష్ణలతో కలిసి జోగ లక్ష్మీదేవి(47) నిమగ్నమైంది. శుక్రవారం సాయంత్రం అకాలవర్షం కురవడంతో అప్పుడే కట్టిన ఇంటి డూమ్ నిర్మాణం పాడవకుండా పరదాలు కప్పేపనిలో నిమగ్నమైంది. ఉరుములు, మెరుపులు తీవ్రం కావడంతో ఇంటికి చేరుకుంది. అంతలోనే పనులు ముగించుకుని ఇంటికి చేరుకుంటున్న భర్త ఎర్రన్నాయుడిని గమనించిన లక్ష్మి జాగ్రత్త.. ఉరుములు, పిడుగులు పడుతున్నాయి.. త్వరగా ఇంట్లోకి రమ్మని చెప్పేందుకు బయటకు వచ్చే ప్రయత్నం చేసింది. అంతే.. పిడుగు పడడంతో ఇంటి ముంగిటే ప్రాణం విడిచింది. కళ్ల ముందే జీవిత భాగస్వామి మరణించడంతో భర్త ఎర్రన్నాయుడు, కుటుంబసభ్యులు సభ్యులు గుండెలవిసేలా రోదించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

జియ్యమ్మవలస రూరల్: పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి శుక్రవారం జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి, జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసి రెండు పోలీస్‌స్టేషన్‌లో దస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అంతేకాకుండా గంజాయి, మత్తు పదార్థాలు యువతకు చేరవేస్తున్న ముఠాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే రహదారి భద్రత, శక్తి టీమ్‌ల నిర్వహణ, క్రైమ్ రేటు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చినమేరంగి ఎస్సై అనీష్, జియ్యమ్మవ ఎస్సై ప్రశాంత్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దాతలకు డీఎస్పీ అభినందనలు



డాక్టర్ బంకురు అప్పలనాయుడు, దాక్షాయణి దంపతులును అభినందిస్తున్న డీఎస్పీ రాంబాబు

సాలూరు: శ్యామలాంబ పండగ నేపథ్యంలో పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం 35 రోడ్డు స్టాపర్స్‌ను వితరణగా అదజేసిన నిహాల్ మల్టీ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బంకురునాయుడు, డాక్టర్ దాక్షాయణి దంపతులను ఇన్‌చార్జ్ డీఎస్పీ రాంబాబు, సీఐ అప్పలనాయుడులు శుక్రవారం అభినందించారు. అమ్మవారి పండగ కోసం తమవంతు సాయం అందించడం చాలా ఆనందంగా ఉందని డాక్టర్ అప్పలనాయుడు ఈ సందర్భంగా అన్నారు.

తిరంగా యాత్రలో మంత్రి



ర్యాలీలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: పాకిస్తాన్‌పై భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమవడంతో త్రివిధ దళాలకు కృతజ్ఞతాభివందనాలు తెలిపేందుకు నిర్వహించిన తిరంగా యాత్రలో స్త్రీ శిశు, గిరిజన సంక్షేమశాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్వీరమణ, మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు, పలువురు అధికారులు, ఉద్యోగులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలుపు మందు నిషేధం

- అమ్మినా, వినియోగించినా చర్యలు
- వ్యవసాయ అధికారి గోవిందరావు



చిరుధాన్యాల సాగుపై ప్రచారం చేపడుతున్న వ్యవసాయ సిబ్బంది, రైతులు

పాచిపెంట: గ్లైఫోసిట్ కలుపు మందు విక్రయం, వినియోగంపై ఆంక్షలు ఉన్నాయని..షాపు యజమానులు అమ్మినా..రైతులు వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు స్పష్టం చేశారు. ఈ మేరకు మండలం లోని పి.కోనవలస, పెద్ద చీపురువలస శ్యామల గౌరీపురం, చెరుకుపల్లి గ్రామాల్లో భూసారం పెంపులో భాగంగా నవధాన్యాల సాగు ఆవశ్యకతపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు సాధ్యమైనంత వరకు కలుపు మందులకు దూరంగా ఉండాలని, గ్లైఫోసిట్ అనే కలుపు మందు సాధారణ వినియోగం విక్రయం రాష్ట్రంలో నిషేధించారన్నారు. దీనివల్ల అనేక అనర్థాలు ఉన్నాయన్నారు. జీవ వైవిధ్యం పూర్తిగా నశించిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వినోద్, నాగమణి ప్రకతి వ్యవసాయ సిబ్బంది విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బాడంగి: వినియోగదారులకు రేషన్‌డిపోల ద్వారా పంపిణీచేస్తున్న పీడీఎస్ బియ్యం ఆటోలో అక్రమరవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న సీఎస్‌డీటీ దారికాచి పట్టుకున్నారు. మండలంలోని ముగడ గ్రామానికి చెందిన వ్యాపారి పెద్దాడ వెంకటరమణ 6.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వినియోగదారులు, డీలర్లనుంచి కొనుగోలుచేసి సాలూరు వైపు అక్రమంగా రవాణాచేస్తున్నట్లు తెలుసుకున్న సీఎస్‌డీటీ స్వర్ణలత బుధవారం సీహెచ్ సీ–డొంకినవలస ఎత్తుకానా సమీపంలో దారికాచి పట్టుకున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

తాగునీటికి కటకట..!

- జిల్లాకేంద్రంలో నాలుగురోజుల కోసారి సరఫరా
- గిరిజన ప్రాంతాల్లో తాగునీటికి అవస్థలు
- తూతూ మంత్రంగా క్రాస్ ప్రోగ్రాం
- ఎన్నికల ముందు హామీ ఇచ్చి మరిచిన నేతలు
- జిల్లాలో నాలుగు తాగునీటి ప్రాజెక్టులు



పార్వతీపురం పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్న దృశ్యం (ఫైల్)

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో తీవ్రంగా తాగునీటి ఎద్దడి నెలకొంది. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల గొంతెండుతోంది. అంతటా దాహం కేకలు వినిపిస్తున్నాయి. కొన్ని నెలలుగా వర్షాలు కురవకపోవడంతో మన్యంలో చాలా చోట్ల భూగర్భ జలాలు, నదులు, చెరువులు అడుగంటాయి. అనేక చోట్ల బోర్లు మొరాయించాయి. రక్షిత నీటి పథకాలు కూడా సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో జిల్లావాసులు తాగునీటికి కటకటలాడుతున్నారు. బిందెడు నీటి కోసం పరుగు పెడుతున్నారు. మరోవైపు వేసవిలో తాగునీటి సరఫరాపై అధికారుల ముందస్తు ప్రణాళిక కొరవడింది. జల్‌జీవన్ మిషన్ పథకం కింద చేపట్టిన పనులను కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. కొన్ని గ్రామాల్లో ఇంటింటికి వేసిన కుళాయిలు దిష్టిబొమ్మల్లా మారాయి. పైప్‌లైన్ల లీకులు తదితర సమస్యలతో కొన్ని ప్రాంతాలకు పూర్తిస్థాయిలో తాగునీరు చేరడంలేదు. కొందరికి బురద నీరే సరఫరా అవుతోంది. విధిలేని పరిస్థితుల్లో ఆ నీటినే తాగి జిల్లా వాసులు రోగాల బారిన పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రజలు చెలమల నీటిపై ఆధారపడుతున్నారు. ఇంకొన్ని చోట్ల రెండు, మూడు రోజులకోసారి మాత్రమే తాగునీరు అందిస్తున్నారు. గిరిజనప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కిలోమీటర్ల దూరంలో ఉన్న గెడ్డ, వాగు నీటినే గిరిజనులు వినియోగిస్తున్నారు. ఇంకొన్ని ప్రాంతాల్లో రోజు తప్పించి రోజు మాత్రమే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. జిల్లాలో తాగునీటి పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక వడంపై జిల్లా వాసులు మండిపడుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో రెండు మున్సిపాల్టీలు, ఒక నగర పంచాయతీ, 451 పంచాయతీలున్నాయి. వాటి పరిధిలో 2,282 గ్రామాలున్నాయి. సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌లు 11, పీడబ్ల్యూఎస్ స్కీమ్‌లు 808, ఎంపీడబ్ల్యూస్కీమ్‌లు 491, సోలార్ స్కీమ్‌లు 407, డైరెక్ట్ పంపింగ్ స్కీమ్‌లు 1,525 ఉన్నాయి. బోర్లు 7,518 వరకూ ఉన్నాయి. అయితే వాటి ద్వారా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు గతంలో జల్‌జీవన్‌మిషన్(జేజేఎం) పథకం కింద 2,013 పనులు మంజూరు చేశారు. ఇందులో 851 పనులు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. వివిధ దశల్లో 703 పనులున్నాయి. అసలు ప్రారంభం కాని పనులు459 వరకూ ఉన్నాయి. ఈ స్కీమ్ ద్వారా గతంలో 1,21,246 కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ప్రభుత్వంలో 65,959 కుళాయి కనెక్షన్లు మాత్రమే పూర్తిచేశారు. 55,287 కుళాయి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ పనులను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

జిల్లా కేంద్రంలో నాలుగురోజులకోసారి..

జిల్లాకేంద్రం పార్వతీపురం మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో 220 పైగా బోరుబావులున్నాయి. వాటి నిర్వహణను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. గతంలో జిల్లా కేంద్రంలో సుమారు రూ. 65కోట్లతో మెగా రక్షిత నీటి పథకం పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం కూటమి నేతలు, అధికారులు ఈ పథకం ఊసే ఎత్తడం లేదు. మున్సిపాల్టీలో సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ప్రధాన పైప్‌లైన్, దానికి అనుసంధానించిన లింకు పైప్‌లైన్‌ల లీకుల కారణంగా తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వేసవికాలంలో కుళాయిల ద్వారా నాలుగు రోజులకోసారి తాగునీటిని అందిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా రెండురోజులకోసారి నీటిని పంపిణీ చేస్తున్నారు.

గిరిజన ప్రాంతాల్లో చెలమలు, నేలబావులే దిక్కు

జిల్లాలో ఎక్కువశాతం గిరిజన ప్రాంతం ఉంది. గిరిజన ప్రాంతాల్లో, కొన్ని గిరిశిఖర గ్రామాల్లో తాగునీటి సమస్యకు గిరిపుత్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని మండలాల్లో చెలమల నీటినే గిరిజనులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్ని మండలాల్లో తాగునీరు సరిగా అందక సమీపంలో గల వసతి గృహాలకు వెళ్లి నీటిని బిందెలతో తీసుకురావల్సిన పరిస్థితి ఏర్పడింది. భామిని, సీతంపేట మండలాల్లో కిలోమీటర్ల దూరం మహిళలు, గర్భిణులు నీటికోసం తహతహలాడాల్సిన పరిస్థితి నెలకొందని గిరిజనులు వాపోతున్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

డిసెంబర్ నెలాఖరులోగా పూర్తిచేస్తాం



జిల్లాలో పెండింగ్‌లో ఉన్న జల్ జీవన్ మిషన్ పనులు డిసెంబర్ నెలాఖరులోగా పూర్తిచేస్తాం. 55,287 కుళాయి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వేసవి ఎద్దడిని నివారించేందుకు జిల్లా వ్యాప్తంగా క్రాస్ ప్రోగ్రాం నిర్వహించాం. కొన్ని గిరిశిఖర గ్రామాలకు తాగునీటి ఇబ్బందులను గుర్తించాం. తాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నాం. అందుకు తగ్గ ప్రణాళికలు రూపొందించాం.

–ఒ. ప్రభాకరరావు,
ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి,
పార్వతీపురం మన్యం

రైతుల భూములు పోకుండా పైప్‌లైన్ వేయాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

విజయనగరం ఫోర్ట్: రైతుల భూములు పోకుండా ప్రత్యామ్నాయంగా విశాఖ నుంచి రాయపూర్ వెళ్లే గ్రీన్‌హైవే పక్కగుండా హెచ్‌పీపీఎల్ వారు పైప్‌లైన్ వేసుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్ భూమి వినియోగపు హక్కు కోసం తీసుకునే ఉపరితల భూమిపై ఇళ్లు, తోటలు, బోర్లు, కట్టడాలు, పశువులు, కోళ్ల షెడ్లు వేసుకునే అవకాశం లేనందున మొత్తం భూమి విలువ కోల్పోతున్నందున రిజిస్ట్రార్ వేల్యూ పరిగణనలోకి తీసుకుని నాలుగు రెట్లు పెంచి ధరను నిర్ణయించి అందులో నుంచి 10 శాతం కాకున్నా 30 శాతం పరిహారం లెక్కకట్టి ఇవ్వాలని కోరారు. పండ్ల తోటలు, చెట్లు జీవితకాలాన్ని లెక్కించి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు లోకవరపు ఆదినారాయణమూర్తి, గంట్యాడ మండల అధ్యక్షుడు కోడెల శ్రీను, రైతు సంఘం నాయకులు గణేష్, నారాయణరావు, గోపాలం, రాములు, పైడిపినాయుడు, ప్రసాద్, దాలినాయుడు, జగన్, సంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం కనులపండువగా జరిపించారు. వెండి మంటపంలో ఉన్న శ్రీ సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో వేంచేపుజేశారు. అనంతరం దీపాలను వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర దీపాల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్‌కుమార్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

మూడు పెంకుటిళ్లు దగ్ధం

గరుగుబిల్లి: మండలంలోని చినగుడబలో మూడు పెంకుటిళ్లు శుక్రవారం దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన ముదిలి కళావతి, ముదిలి మోహన్‌రావు, ముడిలి భాస్కరరావులకు చెందిన పెంకుటిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. కళావతి ఇంట్లో దీపం వెలిగించి ఉపాధిహామీ పనులకు వెళ్లడంతో ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన విషయాన్ని తెలుసుకున్న పార్వతీపురం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో కళావతి కుటుంబం కట్టుబట్టలు మినహా గృహోపకరణాలు, నగదు, బీరువాలో ఉన్న బట్టలు విలువైన పత్రాలు, ధాన్యం అగ్నికి ఆహుతయ్యాయి. ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఉండడంతో ఘటనా స్థలానికి వెళ్లేందుకు ప్రజలు ముందుకు రాలేదు. అయితే అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా వెళ్లి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్‌ను తీసుకురాగా గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మిగిలిన రెండు ఇళ్లలో పెద్దగా నష్టం జరగలేదు. ప్రమాద సమాచారం మేరకు ఘటనా స్థలానికి తహసీల్దార్ పి.బాల, ఆర్‌ఐ శ్రీనివాసరావు తదితరులు వచ్చి పరిశీలించి ఆస్తినష్టాన్ని అంచనా వేశారు. నష్టనివేదికలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.5లక్షలవరకు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపకశాఖాధికారి జి. ప్రభాకరరావు తెలిపారు.

చితికిపోయిన చిన్నారి

- లారీ ఢీకొని బాలుడి దుర్మరణం



బాలుడు లేఖన్‌కుమార్ (ఫైల్)

కొత్తవలస: తెల్లతెలవారగానే అప్పుడే నిద్ర లేచి అక్క పాల ప్యాకెట్‌కు వెళ్తోందని తాను కూడా వెంట వెళ్తానని ఏడేళ్ల బాలుడు మారాం చేసి అక్కతో పాటు వెళ్లాడు. పాల ప్యాకెట్ తీసుకుని అక్కాతమ్ముళ్లు రోడ్డు దాటుతుండగా యమపాశం రూపంలో దూసుకువచ్చిన భారీ లారీ బాలుడిపైకి వెళ్లడంతో శరీరం నుజ్జు నుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం తెలవారుజామున జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాలుడి తల్లి, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస మండలంలోని అరకు–విశాఖ జాతీయ రహదారి కొత్తవలస ఫైర్‌స్టేషన్ సమీపంలోని జనార్దన్ లేవుట్‌లో గల సాయిసంపత్ అపార్ట్‌మెంట్‌లో వాణికుమారి ఇద్దరు పిల్లలతో కలిసి తన తల్లి వద్ద ఉంటోంది. ఇటీవల భర్తతో కలహాలు రావడంతో ఆమె పిల్లలతో వచ్చి తల్లి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో ఎప్పటిలాగానే కూతురు వందస్వి(9)నిని పాలప్యాకెట్ కోసం రోడ్డు అవతలి వైపు గల పాలబూత్‌కు పంపించగా తాను కూడా వెళ్తానని కుమారుడు లేఖనకుమార్ (7) అక్కతో పాటు వెళ్లాడు. పాలప్యాకెట్ కొని రోడ్డు దాటుతుండగా మితిమీరిన వేగంతో ఎస్‌కోట వైపు వెళ్తున్న భారీ లారీ ఢీకొట్టడంతో బాలుడు శరీరం ముక్కముక్కలై రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయింది. పరిగెత్తుకుంటూ వెళ్లిన పాప జరిగిన విషయాన్ని తల్లి, అమ్మమ్మకు చెప్పడంతో వారు వచ్చి చూసేసరికి దారుణం జరిగిపోయింది. తల్లి వాణికుమారి గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడ ఉన్నవారిని కంట తడి పెట్టించింది. విషయం తెలుసుకున్న కొత్తవలస సీఐ షణ్ముఖ రావు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేసి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తాపడి ఉపాధి వేతనదారు మృతి



ప్రసాదరావు మృతదేహం

వీరఘట్టం: మండలంలోని గడగమ్మ గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారు అరసాడ ప్రసాదరావు(49) ఆటో బోల్తా పడడంతో జరిగిన ప్రమాదంలో శుక్రవారం మృతిచెందాడు. ఈ మేరకు ఉపాధి హామీ ఏపీఓ జి.సత్యంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం గడగమ్మ గ్రామం నుంచి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నగోర గ్రామంలోని ఆరుద్రమ్మ చెరువులో జరుగుతున్న ఉపాధి పనులకు గ్రామానికి చెందిన వేతనదారులు గడిచిన 7 వారాలుగా ఆటోలపై వెళ్తున్నారు. ఎప్పటిలాగానే శుక్రవారం కూడా వేతనదారులతోబయల్దేరిన ఆటోల్లో ఒక ఆటో అచ్చెపువలస గ్రామ సమీపంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయాలైన అరసాడ ప్రసాదరావును మెరుగైన వైద్య చికిత్స కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసాదరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు.

పిడుగుపాటుతో గిరిజన యువకుడు..



చంద్రరావు మృతదేహం

సీతంపేట: మండలంలోని దేవనాపురం సమీపంలో పిడుగు పాటుకు గురై ఓ గిరిజన యువకుడు శుక్రవారం మృతిచెందాడు. జేపీ బూర్జగూడకు చెందిన సవర చంద్రరావు(28) దేవనాపురం ప్రాంతంలో ఉన్న పొలంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కి దున్నించిన అనంతరం ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు రావడంతో పిడుగు ఒక్క ఉదుటన దగ్గరగా పడడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడు అవివాహితుడు. తండ్రి జమ్మయ్య కొన్నేళ్ల కిందట మృతిచెందాడు. చంద్రరావు మృతివార్త విన్న తల్లి సొట్టమ్మ, సోదరుడు రమేష్‌లు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఎస్సై వై.అమ్మన్నరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

శాంతిని కోరుతూ చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: భారత్ పాకిస్తాన్‌ల మధ్య తలెత్తిన వివాదం కారణంగా భారతీయ సైనికుల క్షేమం, దేశ శాంతిని కోరుతూ రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో శుక్రవారం వేద పండితులు శాస్త్రోక్తంగా చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అథర్వణ వేదపండితుడు సాయికిరణ్ శర్మ, యుజుర్వేద పండితుడు వెలువలపల్లి నరసింహమూర్తి మాట్లాడుతూ విశ్వశాంతికి, భారతదేశం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, యుద్ధంలో మన సైనికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని యజ్ఞయాగాదులను నిర్వహించామన్నారు. అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని చండీయాగం చేపట్టామని తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారు ప్రసిద్ధికెక్కారని, సుమారు 80 మంది దంపతులు యాగంలో పాల్గొనడం విశేషమన్నారు. యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ ప్రసాద్ పర్యవేక్షించారు.

ఉషు పోటీల్లో భామిని విద్యార్థుల సత్తా



విజేతలకు అభినందనలు తెలియజేస్తున్న కోచ్ సోమేష్, స్పోర్ట్స్ అధికారి దయానందం

భామిని: ఉషు పోటీల్లో భామిని విద్యార్థులు సత్తా చాటి మెడల్స్ సాధించి పలువురి మన్ననలు పొందారు. ఈ నెల 12,13 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో భామిని విద్యార్థులు విజేతలుగా నిలిచారని క్రీడల కోచ్ కె.సోమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట ఐటీడీఏ స్పోర్ట్స్ అధికారి ఎస్.జాకోబ్ దయానందం సహాయ సహకారాలతో పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఉషు పోటీలలో జూనియర్ విభాగంలో ఎస్.కె.శాంతి, సీనియర్ విభాగంలో పి.దీపిక, కె.సోమేష్‌లు గోల్డ్ మెడల్స్, పి.నాగరాజు, పి.చరణ్‌లు సిల్వర్ మెడల్స్ సాధించారని కోచ్ తెలిపారు. ఈ మేరకు పసుకుడిలో విజేతలను మండల నాయకులు బి.రవినాయుడు, కిరణ్‌కుమార్‌లు అభినందించారు.

సారా రహిత గ్రామంగా అప్పయ్యపేట

- గ్రామసభలో పంచాయతీ తీర్మానం



గ్రామసభలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ వెంకట్రావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట పంచాయతీ అప్పయ్యపేట గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దామని ఎక్సైజ్ సీఐ వెంకట్రావు తెలిపారు. గ్రామపెద్దలు, ప్రజల సమక్షంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించి ఈ మేరకు పంచాయతీ తీర్మానం చేశామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా సారా అమ్మకాలు జరిపే 'బి' కేటగిరిలో అప్పయ్యపేటను గతంలో గుర్తించామని, గడిచిన మూడు నెలల నుంచి గ్రామ, మండలస్థాయి కమిటీలు ఏర్పాటు చేసి ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. సారా అమ్మకాలు, నిల్వలపై నిఘా పెట్టామని, అనుమానితులను గుర్తించి బైండోవర్ చేశామన్నారు. అనంతరం జరిపిన దాడుల్లో మూడు నెలలుగా సారా విక్రయిస్తున్నట్లు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, తాజాగా నిర్వహించిన గ్రామసభలో పూర్తిస్థాయి అంచనాకు వచ్చి సారా రహిత గ్రామంగా ఏకగ్రీవంగా తీర్మానించామని తెలిపారు. ఇకపై ఎలాంటి అమ్మకాలు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై నాగేశ్వరరావు, సర్పంచ్ అట్టాడ శ్రీను, దత్తత అధికారి కృష్ణ, కార్యదర్శి బంగార్రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తొలగదు.. కంపు వదలదు

పార్వతీపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ఆ వీధుల శివారుల్లో పడవేయడంతో స్థానికంగా ఉండేవారు దుర్వాసన పీలుస్తూ ఆరోగ్యపరమైన సమస్యలకు గురవుతున్నారు. క్రమం తప్పకుండా సేకరించిన చెత్తను ఆయా గ్రామాల్లోని ఉన్న చెత్త సేకరణ కేంద్రాలకు తరలించి తడి, పొడి, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేసి వర్మీకంపోస్టు తయారు చేయాలి.

కానీ గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితి భిన్నంగా ఉంది. రోజుల తరబడి చెత్తను ఒకే చోట పోగు చేసే దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు చెత్త నిల్వలను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.



చినబొండపల్లిలో వీధి శివారులో ఏర్పడిన చెత్త డంపింగ్



వెంకంపేట ఎస్సీకాలనీ ప్రారంభంలో ఉన్న చెత్తకుప్ప

16 కేజీల గంజాయితో నలుగురి అరెస్ట్

కొత్తవలస: మండల కేంద్రంలో గల రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టగా 16 కేజీల గంజాయితో నలుగురు నిందితులు పట్టుబడినట్లు సీఐ షణ్ముఖ రావు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ తెలిపిన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం రాత్రి కొత్తవలస రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించగా ప్లాట్‌ఫామ్–1లో బ్యాగులతో నలుగురు వ్యక్తులు అనుమానాస్పందంగా తిరుగుతూ పోలీసులను చూసి కంగారు పడి పారిపోయేందుకు సిద్ధమవుతుండగా పట్టుకుని విచారణ చేసినట్లు తెలిపారు. వారి దగ్గర ఉన్న బ్యాగ్‌లను తెరిచి చూడగా పది గంజాయి ప్యాకెట్లలో 16 కేజీలు గంజాయి ఉన్నట్లు చెప్పారు. విజయవాడ ప్రాంతంలోని వాంబే కాలనీకి చెందిన జోజిబాబు, శామ్యూల్‌జాన్, మనికంఠ, మహేశ్వరరావులుగా నిందితులను గుర్తించామన్నారు. ఒడిశాలోని పాడువలో ఒక వ్యక్తి దగ్గర 16 కేజీల గంజాయిని నిందితులు కొనుగోలు చేసినట్లు విచారణలో తేలిందని, నిందితులు అక్కడి నుంచి కిరండోల్ రైల్లో కొత్తవలస వరకు వచ్చి అక్కడి నుంచి ఆటోలో విశాఖపట్నం చేరుకుని రోడ్డు మార్గంలో విజయవాడ వెళ్లేందుకు ప్రణాళిక వేసుకున్నారన్నారు. ఇందులో భాగంగా కొత్తవలస రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్న సమయంలో పట్టుబడినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి విజయనగరం జీఆర్‌పీ ఎస్సై బాలాజీకి గంజాయిని, నిందుతులను అప్పగించినట్లు సీఐ వివరించారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

రాజాం సిటీ: కుక్కలు విచ్చలవిడిగా స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. శుక్రవారం పట్టణ పరిధిలోని కాలెపువీధికి చెందిన చిన్నారి గంపల లలిత ఇంటి ముందు ఆరుబయట ఆడుకుంటుండగా ఒక్కసారిగా కుక్కలు దాడిచేసి గాయపర్చాయి. వెంటనే స్థానికులు స్పందించి తీవ్రంగా గాయపడిన చిన్నారిని సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అలాగే మండల పరిధి మారేడుబాక గ్రామానికి చెందిన కోరాడ నారాయణమ్మ అనే వృద్ధురాలు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కుక్కలు దాడిచేసి గాయపర్చాయి. కుటుంబసభ్యులు రాజాం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పట్టణంతోపాటు మండలంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని పలుమార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

రాజాం సిటీ: మండల పరిధి శ్రీకాకుళం రోడ్డులోని రెండో మైలు రాయివద్ద శుక్రవారం బైక్ అదుపు తప్పడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం న్యూకాలనీకి చెందిన కేవీఎస్ భక్తవత్సలం తీవ్రగాయాల పాలయ్యాడు. రాజాం నుంచి స్వగ్రామం శ్రీకాకుళం ద్విచక్రవాహనంపై ఆయన వెళ్తుండగా రెండో మైలు రాయి వద్దకు వచ్చేసరికి మోటార్‌సైకిల్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో భక్తవత్సలం తలకు తీవ్రగాయాలు కావడంతో 108కు సమాచారం అందించగా ఈఎంటీ ఆలుగుబిల్లి శ్రీనివాసరావు, పైలెట్ శంకరరావులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం తరలించారు.